ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ఏ.ఐ.టి.యు.సి.రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఎన్నికల హామీలను విస్మరించి,దేశ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు అమ్ముతున్న మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని ఏ.ఐ.టి.యు.సి.రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ కోరారు. శ్రీకాకుళంలో ఆదివారం జరిగిన ఏ.ఐ.టి.యు.సి. ముఖ్య సలహాదారు చిక్కాల గోవిందరావు అధ్యక్షతన దేశ వ్యాప్త సమ్మె సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల ముందు మోడీ వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని, ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు కల్పిస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, ప్రత్యేక హెూదా, విశాఖ రైల్వే జోన్,వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు ఇస్తామని తిరుపతిలో హామీ ఇచ్చిన మోడీ మట్టి కుండ ఇచ్చాడని అన్నారు. మోడీ పదేళ్ళ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలు, ఆస్తులను అంబానీ, ఆధానీ వంటి కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా అమ్ముతూ ధారాదత్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నలభై నాలుగు కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికుల హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు. కోట్లాదిమంది కార్మికులు పరిశ్రమలు మూత వేయడం, పరిశ్రమలు ప్రైవేట్ చేయడం వల్ల బజారున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన అమలు చేయుటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ధరలు పెంచి సామాన్య, మధ్య తరగతి ప్రజల నడ్డి విరిచారని ఆవేదన వ్యక్తం చేశారు.మూడు నల్ల చట్టాలు తెచ్చి రైతాంగానికి భూమి నుండి వెళ్లగొట్టే ప్రయత్నిస్తే, దేశ వ్యాప్త రైతాంగ ప్రతిఘటన పదమూడు నెలలు ఢిల్లీ రైతాంగ పోరాటానికి తలదించి వెనక్కు తీసుకోవడం జరిగిందని అన్నారు. రైతు, కార్మిక, ఉద్యోగ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం 1996 కేంద్ర ప్రభుత్వం తెచ్చినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయుటలో విఫలం అయ్యారని అన్నారు. దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయుటకు విస్తృత ప్రచారం చేయాలని ఆయన కోరారు. సంఘం బలోపేతం చేయుటకు జిల్లా కౌన్సిల్‌లోకి తమిరి తిరుపతిరావు, కె.అప్పలరాజు, జే.గురు మూర్తి, ఎం.రాఘవ, ఎం.రామారావు, ఎన్.దుర్గా రావు, ఎల్.రాజు, జీ.శ్రీను, టి.సత్యం, యజ్జల రామారావు లను వివిధ కార్మిక సంఘాల నుండి తీసుకోవడం జరిగింది. ఈకార్యక్రమంలో ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి అనపాన షణ్ముఖ రావు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల పోలారావు, ఉప్పాడ సూర్యనారాయణ, ఎలక్ట్రీషియన్ సంఘం నాయకులు బమ్మిడి వేణు, బైకు మెకానిక్ సంఘం నాయకులు చిట్టి సింహాచలం, మత్స్య కార్మిక సంఘం నాయకులు నాగుల తవుడు, ఆటో యూనియన్ నాయకులు చుక్క రాము, లబ్బ రమణ, బమ్మిడి రాజు, వై.ప్రసాద్, గణేష్, త్రినాథ్, దుర్గా ప్రసాద్, రామచంద్ర, మణి, సోగ్గాడు, ఆర్.గణేష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

50ఏళ్లు పైబడిన జర్నలిస్టులందరికీ పెన్షన్ సదుపాయం కల్పించాలి

ప్రెస్ క్లబ్ చైర్మన్ ప్రసాద్‌రావు

విశాలాంధ్ర-ఆమదాలవలస : వివిధ పత్రికల్లో గత ఎంతోకాలం నుండి పనిచేస్తున్న సుమారు 50 ఏళ్లకు వయస్సు పైబడిన సీనియర్ జర్నలిస్టులు అందరికీ పెన్షన్ సదుపాయం కల్పించాలని ఆమదా లవలస ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్‌చైర్మన్ గురుగు బెల్లి ప్రసాదరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో గల గాజులు కొలి వలస లో ఉన్న సంగమేశ్వర స్వామి ఆల యం వద్ద నిర్వహించిన నూతన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టు వృత్తిపరంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటావు సతమతమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ప్రతి జర్నలిస్టుకు ఉచితంగా హెల్త్ కార్డులు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు అదేవిధంగా సీనియర్లైన వెట రన్ జర్నలిస్టుల అక్రిడేషన్ల వయోపరిమితి 60 ఏళ్ల నుండి 50 ఏళ్లకు కుదించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈసంఘాన్ని శ్రీకాకుళం జర్నలిస్టుల ఫోరం సంస్థకు అనుబంధంగా చేర్చుటకు తీర్మానం చేసినట్లు ఆయన ప్రకటించారు. ఈసమావేశానికి ముందుగా కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికలకు గాను సీనియర్ జర్నలిస్టులు యర్నాగుల సుధాకర్, సువ్వారి మురళీధర్, రామచంద్ర రావు, న్యాయ సలహాదారుగా తమ్మినేని అన్నంనాయుడులు పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ సమావేశం లో సీనియర్ జర్నలిస్టులో పొన్నాడ రాము టీ.అప్పలనాయుడు, రెడ్డి తౌడు కూన రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జీడి గిట్టుబాటు ధర కల్పించాలి

రాష్ట్ర మంత్రి డా.సీదిరికి ప్రజాసంఘాల వినతి

విశాలాంధ్ర-పలాస : ఉద్దానంలో విస్తారంగా పండుతున్న జీడి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు పత్తిరి దానేషు, సాలిన వీరాస్వామి, పిండి వెంకటరావులు మాట్లాడుతూ దశాబ్దాలుగా జీడి పంటను నమ్ముకొని బ్రతుకుతున్న రైతుల బ్రతుకులు మారాలని కోరుతూ రైతులు, రైతు సంఘాలు, ఉద్యమకారులు, ప్రజాసంఘాలు అనేక రూపాల్లో పోరాటాలు చేశాయని అన్నారు. ప్రైవేటు వ్యాపారుల దోపిడి నుంచి రైతులను ఆదుకోవాలని కోరినా నేటి వరకు గిట్టుబాటు ధర సమస్య పరిష్కరించబడలేదని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది వ్యాపారస్తులు జీడి పప్పు వ్యాపారం చేస్తూ కోట్లాది రూపాయలు గడిస్తున్నా రైతులు మాత్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి వారి జీవితమే ప్రశ్నార్ధకంగా మారిందన్నారు. వీటి నుంచి బయట పడాలంటే ఆర్థిక మార్గం జీడి పంటకు గిట్టుబాటు ధర ఏర్పాటు చేయడమేనన్నారు. ఈ విషయం ప్రభుత్వానికి, పాలకులకు తెలియంది కాదని, ఆరు దశాబ్దాల నుంచి ఉద్దాన ప్రాంత ప్రజల ప్రధాన డిమాండ్ అయిన గిట్టుబాటు ధర ప్రభుత్వాలు పరిష్కరించలేకపోయాయని వాపోయారు. కేవలం హామీలు మాత్రమే మిగిలాయని, ఈ సమస్య కేవలం ఉద్దాన ప్రాంతాలకే పరిమితం కాలేదని, రాష్ట్రంలో సుమారు 8 జిల్లాల్లో జీడి పంటకు గిట్టుబాటు ధర కోసం రైతులు ఉద్యమిస్తున్నారని అన్నారు. గిట్టుబాటు ధర కల్పించేందుకు ఏకైక మార్గం ప్రభుత్వరంగం ముందుకు రావాలని, కార్పొరేషన్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, దీనికి మించి వేరే ప్రత్యామ్నాయ మార్గాలు లేవన్నారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టిసారించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వివిధ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో జీడిపిక్కల గిట్టుబాటు ధర, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు, పటిష్టమైన కార్పొరేషన్ వ్యవస్థ ఏర్పాటు చేస్తామంటూ పొందుపర్చాలని కోరారు. దాని ద్వారా ప్రజలకు కచ్చితమైన హామీ ఇవ్వటం మూలంగా ప్రభుత్వాలపై నమ్మకం పెరుగుతుందన్నారు. ఎన్నికల ప్రచారానికి ముందు నాయకులు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతన్నలను ఆదుకుంటామని అసెంబ్లీ సాక్షిగా తీర్మాణం చేస్తామని ప్రకటించాలని, అప్పుడే ఆయా రాజకీయ పార్టీలపై రైతులకు విశ్వాసనీయత పెరుగుతుందన్నారు. అలాగే జీడిపండించే రైతులకు గిట్టుబాటు ధర కోసం రాష్ట్ర బడ్జెట్‌లో కొంత కేటాయించి జీడి రైతులను ఆదుకోవాలని కోరారు. దీనిపై రాష్ట్ర మంత్రి డా.సీదిరి అప్పలరాజు స్పందిస్తూ వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, ప్రజాసంఘాల డిమాండ్‌ను ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. వినతిపత్రం అందజేసిన దుశ్యంత్, దున్న క్రిష్ణ, రెయ్యి భీమారావులతోపాటు పలు విప్లవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

బటన్ నొక్కారు సరే... సొమ్ములేవి?

- ఆసరా సొమ్ము కోసం మహిళల ఎదురు చూపులు
- నాల్గో విడత ఒక్క రూపాయి పడలేదు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : సార్ బటన్ అయితే నొక్కారు. సొమ్ములు ఎప్పుడు పడతాయో అని లబ్ధిదారులు ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. గత నెల 23వ తేదీనా నాల్గొ విడత ఆసర సొమ్ములు విడుదల చేసేందుకు సభపెట్టి సీఎం సార్ బటన్ నొక్కారు. ఇప్పటికీ ఒక్క గ్రూప్‌నకు కూడా సొమ్ము పడితే ఒట్టు. అయితే గతనెల 29వ తేదీన కోటబొమ్మాళి మండల కేంద్రంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, వెలుగు అధికారులు కలిసి మండల కేంద్రంలో డ్వాక్రా సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి డ్వాక్రా మహిళంతా తప్పని సరిగా హాజరు కావాలని, డబ్బులు మీఖాతాలలో వెంటనే వేస్తామని చెప్పటంతో మహిళమంతా వ్యవసాయపనులు, కూలీ పనులు మానుకొని ఆటోలకు డబ్బులు కట్టుకొని మరీ హాజరయ్యామని. తీరా సమావేశం జరిగి ఆరు రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు తమకు డబ్బులు అందలేదని మహిళలు వాపోతున్నారు. ఆసర సొమ్ములకోసం నెలరోజుల ముందుగానే డ్వాక్రా మహిళచే వేలిముద్రలు వేయించుకున్నారు. ఇప్పుడు డ్వాక్రా డబ్బుల కోసం బ్యాంకుల చుట్టు ప్రదీక్షణలు చేస్తున్నారు. దీంతో డబ్బులు వేయకుండా బటన్ ఎందుకు నొక్కాలని, మాలో ఎందుకు అశలు రేపాలని మహిళలు ముఖ్యమంత్రి స్థానిక వైకాపా నాయకులు పై మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలకోసం బటన్ నొక్కుతున్నారు కానీ అవి లబ్ధిదారుల ఖాతాలలో జమ అయ్యేటప్పటికి ఐదారునెలలు పడుతుందని, అప్పటికి ఏవో సాకులు చూపి కొంతమంది ఖాతాలలో జమకావటంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఏదిఏమైన ఆసరా నాల్గొవిడత విషయంలో మహిళలు ముఖ్యమంత్రిపై మండిపడుతున్నారు. ఎన్నికల దగ్గరపడుతున్న తరుణంలో ముఖ్యమంత్రి ఇలాంటి పనులు చేయటం సరికాదని పలువురు విశ్లేషకులు వారి అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

రోగులకు మరిన్ని మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

జడ్పీచైర్పర్సన్, నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త పిరియా విజయ సాయిరాజ్

విశాలాంధ్ర-కవిటి : రోగులకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జడ్పీ చైర్పర్సన్, నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ పిరియా విజయ సాయిరాజ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మాణిక్యపురం గ్రామంలో కోటి 75 లక్షల రూపాయలు నాడు నేడు నిధులతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనానికి ప్రారంభోత్సవ కార్యక్రమం జడ్పీ చైర్ ర్సన్ పిరియా విజయ సాయిరాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు చేతుల మీదుగా చేపట్టారు.అనంతరం ఆమె మాట్లాడుతూ సంక్షేమం, సుపరిపాలన అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని అన్నారు.ఆంధ్ర రాష్ట్ర పరి పాలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు.జగనన్న ప్రభుత్వం సుపరిపాలన ప్రయోజనాలు,సంక్షేమ పథకాలను ప్రజల గడప వద్దకే చేరుస్తోందని అన్నారు. రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచన చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ శాసనసభ్యులు నరేష్ కుమార్ అగర్వాల్, ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షులు దేవరాజ్ సాహు, స్వచ్ఛభారత్ డైరెక్టర్ కృష్ణారావు రౌల్లో,స్థానిక సర్పంచ్ లలిత దేవరాజ్ సాహు, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, పి యం తిలక్, బద్రి ప్రకాష్ ఏఎంసి వైస్ చైర్మన్ నీలయ్య,స్థానిక ఎంపీటీసీ సభ్యులు సత్యసంతోష్ సాహు, అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రసాద్ రావు,డాక్టర్ కొంచాడ అప్పలరాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు భాస్కరరావు, ధనలక్ష్మి, డాక్టర్ బ్రహ్మం, రత్నాకర దోలాయి, కె శ్రీనివాసరావు, బి రమణ కొయిరా సాహు, పి శ్రీను, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రమణమ్మకు ఎంపీపీ సభ్యులు సన్మానం

విశాలాంధ్ర-నందిగాం : రమణమ్మ ను సన్మానిస్తున్న ఎంపీపీ సభ్యులు నందిగామ మండలం హరిదాసు పురం గ్రామంలో ఎంపీటీసీ రామచంద్రుడు ఆధ్వర్యంలో ఆదివారం వైయస్సార్ ఆసరా కార్యక్రమంలో ఎంపీపీ శ్రీరామ్ మూర్తి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి మహిళలతో కలిసి గ్రామస్తులు పెద్ద ఎత్తున పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో చిన్ని జోగారావు, కవిటీ ఎర్రన్న, హరిదాసు పురం సర్పంచ్ కనితి నారాయణమూర్తి పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో 'టీ విత్ టౌన్ పీపుల్'



విశాలాంధ్ర-పలాస : జనసేన పార్టీ గుర్తు గాజు గ్లాసును ప్రజలకు చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా ఆదివారం పార్టీ కష్టకాలంలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఎన్నికలలో పార్టీ గుర్తుపై పోటీ చేసిన జనసేన పార్టీ నాయకులు విశ్రాంత ఎస్సై కోన కృష్ణారావు అధ్వర్యంలో టీ విత్ టౌన్ పీపుల్ అనే కార్యక్రమం నిర్వహించారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ నాలుగవ వార్డ్ శాంతినగర్ కాలనీలో వార్డ్ ప్రజలకు పార్టీ సిద్ధాంతాలు తెలియజేశారు. సామాన్యుడికి జనసేన పార్టీ సిద్ధాంతాలు తెలియజేసి అధికార పార్టీ అరాచకాలు నుంచి బైటకి వచ్చి రాబోయే ఎన్నికలలో జనసేన-టీడీపీ కూటమికి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా శాంతినగర్ వాసులు అనేక సమస్యలు జనసేన నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. త్వరలో వాటిపై కార్యాచరణ చేస్తామని జనసేన నాయకులు హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీలో ఈ కార్యక్రమాలు నిర్వహించి మున్సిపాలిటీ ప్రజలందరికని కలుపుకుని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన-టీడీపీ కూటమికి ఓటు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనే విషయంపై అవగాహన కల్పించేలా చూస్తామని ప్రజలకు ఈ కార్యక్రమం ద్వారా తెలిపారు . ఈ కార్యక్రమంలో తామడ రోజా రాము, అశోక్, జనసేన పార్టీ జిల్లా కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యులు గిరీశ్, ఐటీ విభాగం సభ్యులు లావేటి సురేష్, కిరణ్, శ్రీకాంత్, ఉదయ్ కిరణ్, చరణ్, వాడరేవు అశోక్ లతో పాటు వజ్రపుకొత్తూరు బీజేపీ-జనసేన జడ్పీటీసీ అభ్యర్థి పుక్కల శ్రీదేవి ఉమ మహేష్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రాధాన్యం : రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-గార : అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ వివిధ పనులు చేపడుతున్నామని రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం, సీఎస్పీ రోడ్డు నుంచి కొర్ని కొర్లాం మీదుగా కొమరవానిపేట వరకు వరకు 7.2కి మీ రోడ్, రూ 1.4కోట్ల రూపాయలతో నిర్మించిన బీటీ రోడ్ ను రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రారంభించారు. అభివృద్ధి, సంక్షేమం అన్నవి వైఎస్సార్ కాంగ్రెస్ నేతృత్వాన నడుస్తున్న ప్రభుత్వానికి సమ ప్రాధాన్యాలని, వాటి ఆధారంగా పాలనలో ముందుకు వెళ్తుందని తెలిపారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. రోడ్డు పనులను సత్వరం పూర్తి చేసిన ఇంజనీరింగ్ సిబ్బందికి, కాంట్రాక్టర్ కు ఆయన శుభాభినందనలు తెలిపారు.

మూలపేట పోర్టు పనులు కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-సంతబొమ్మాళి... ఈ మండలం మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు, నౌపడలో పునరావాస కాలనీల నిర్మాణం జరుగుతున్న పనులు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ ఖమార్ కలసి ఆదివారం పరిశీలించారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ మూలపేటలో పర్యటించి పోర్టులో జరుగుతున్న పనులను స్వయంగా సంభందిత అధికారులకు అడిగి తెలుసుకున్నారు. పోర్టు మేనేజర్ శంకర్ ను అడిగి పలు నిర్మాణాలు పురోగతి విషయాలు తెలుసుకున్నారు. నార్త్ బ్రేక్, సౌత్ బ్రేక్ వాటర్ నిర్మాణం పనులను సముద్రంలోకి వెళ్లి పరిశీలించారు. తీరంలో చేపడుతున్న సివిల్ వర్క్, పోర్టు అప్రోచ్ రోడ్డు, పోర్టు డిజైనింగ్ మ్యాప్ సహాయంతో పరిశీలించారు. అనంతరం నౌపడలో పునరావాస కాలనీ నిర్మాణం జరుగుతున్న పనులు పరిశీలించారు. ఫ్లాట్లు గుర్తించి నిర్వాసితులకు అందజేసేందుకు త్వరితగతిన కాలనీ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, రెవెన్యూ, సర్వే, అధికారులతో మాట్లాడి నిర్మాణ పనుల వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిటి ప్రవీణ్ కుమార్, ఆర్ ఐ మౌళి, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

ఆపోటా నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-సోంపేట/కంచిలి : కంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (ఆపోటా) రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ బరాడొ అధ్యక్షతన సర్వసాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆపోటా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఈ ఎన్నిక ఆపోటా మాజీ రాష్ట్రఅధ్యక్షుడు కైలాస్ చంద్రనాయక్, రవినారాయణ చౌదరి పర్యవేక్షణలో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడుగా భాస్కర్‌పాడి, ఉపాధ్యక్షులుగా రామహరిపాడి, సురేంద్ర వండి, ప్రధాన కార్యదర్శిగా బృందావన్ దొళాయి, సంయుక్త కార్యదర్శిగా జెని కృష్ణమూర్తి, సుదర్శన బెహరా, సహాయక కార్యదర్శిగా జయరాం మాళి, ఎన్.రవికుమార్, ఆడిటర్‌గా గోవిందరాజ్ నల్ల, సహాయక ఆడిటర్‌గా వి.లావణ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆపోటా ముఖ్య సలహాదారు దుర్గ ప్రసాద్ చౌదరి ఎన్నికైన సంఘం నూతన కార్యవర్గ సభ్యులచే ప్రతిజ్ఞ చేయించారు.

నిత్య అన్నదానం

విశాలాంధ్ర-ఆమదాలవలస: పట్టణ వర్తక, వాణిజ్య, సేవ హృదయ సంఘం ఆధ్వర్యంలోని శ్రీమాతా అన్నపూర్ణే శ్వరీ దేవి సభ్యులు స్థానిక వెంకటేశ్వర ఆలయం వద్ద నిత్య అన్నదానం చేసేందుకు సంకల్పించారు. మూడు రోజులుగా పేదలకు అన్నసంతర్పణ నిర్వహిస్తున్నారు. ఈ అన్న సంతర్పణలో పట్టణంలోని కొందరు ప్రము ఖులు పుట్టినరోజులు, పెళ్లి రోజు, వారి పెద్దల స్మృతి తదితర అంశాలపై అన్నదానం ఖర్చు కమిటీ సభ్యులకు అందిస్తున్నారు. గుడ్ల బాపూజీ, గొంది రవి, మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు పేదలకు అన్నదానాన్ని అందిస్తున్నారు. ఆదివారం వెంకటేశ్వర బ్యాంగిల్ షాప్ యజమాని గుడ్ల మధు గీత దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. నిత్యాన్న దాన కార్యక్రమంలో ఆదివారం ఈ దంపతులు భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో పలువురు దాతలు సహాయం అందించాలని కోరుతున్నారు.

పవన్‌ను కలిసిన నాయుడు రాజశేఖర్

విశాలాంధ్ర-జలుమూరు : ఇటీవల జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని, జనసేన- బిజెపి ప్రస్తుతానికి కలిసి ఉన్న సందర్భంగా శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థిగా నా పేరును పరిశీలించాలని పవన్ కళ్యాణ్‌ను కలిసి కోరడం జరిగిందని సామాజిక కార్యకర్త అండ్ బిజెపి రాష్ట్ర నాయకులు నాయుడుగారి రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఒకసారి పార్లమెంటుకి, 2019లో అలాగే రెండుసార్లు ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా, పోటీ చేసిన అనుభవం ఉంది. కాబట్టి తప్పకుండా నా అభ్యర్థిత్వాన్ని ప్రకటించాలని స్వయంగా చెప్పడం జరిగిందని, ఆయన తప్పకుండా పరిశీలిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అదే విధంగా ఎన్నో ఏళ్లుగా నరసన్నపేట రెండు కుటుంబాల వల్లే పరిపాలిస్తున్నారు. ఒకసారి యువతకు అవకాశం వస్తే నియోజకవర్గాల్లో సమ్మిళిత అభివృద్ధి చేసే అవకాశం వస్తుందని చెప్పడం జరిగిందని రాజశేఖర్ తెలిపారు.

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

విశాలాంధ్ర-రణస్థలం : శాఖా గ్రంథాలయంలో మాసంలో జరిగే ప్రతి మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ పుస్తక ప్రదర్శనలో పాఠకుల కోరిక మేరకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే పరీక్షల్లో పాల్గొనుటకు భారత దేశ చరిత్ర జోగినాయుడు, ఆధునిక భారతదేశ చరిత్ర మోడల్ పేపర్స్, ఇండియన్ సొసైటీ, జనరల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇండియన్ పాలిటీ బిట్ బ్యాంక్, ఎన్సీఈఆర్టీ బుక్స్, ఏపీపీఎస్సీ డిఏఓ, ఆంధ్ర ప్రదేశ్ చరిత్ర, భారత రాజ్యాంగ మోడల్ పేపర్స్, ఇండియన్ ఎకానమీ, జనరల్ సైన్స్ అండ్ టెక్నాలజీ జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ, ఆర్ఆర్బి గ్రూప్ డి,ఏపీ టెట్ మోడల్ పేపర్ స్ ,భారతీయ తపాలా శాఖ వంటి పుస్తకాలను ప్రదర్శించారు. అలాగే ఇప్పుడు గ్రూప్స్ ప్రిపేర్ అయినవారు ఉన్న పుస్తకాలను వినియోగించుకోవాలని కోరారు. తదనంతరం చదవడం మాకిష్టం కార్యక్రమంలో ముందుగా దినపత్రికల పఠనం, కథలను చదివించడం, దేశ నాయకులు జీవిత చరిత్రలను చదివించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, పాఠకులు మరియు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్ హత్య ప్రభుత్వ వైఫల్యమే

జనసేన నాయకులు, పలాస మున్సిపల్ మాజీ చైర్మన్ కోత

విశాలాంధ్ర-పలాస : నందిగాం మండలం దిమ్మిలాడ గ్రామానికి చెందిన సనపల రమణయ్య వృత్తి రీత్య విశాఖలో ఉంటూ దారుణ హత్యకు గురి కావడం బాధాకరమని, ఈ హత్యకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని జనసేన నాయకులు, పలాస మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ విశాఖపట్టం ప్రశాంతతకు నిలయమని, అటువంటి పట్టణంలో ఇటీవల పట్టపగలు, అర్ధరాత్రి తేడా లేకుండా ఇటువంటి హత్య సంఘటనలు జరగడానికి ముఖ్యమంత్రి పాలన విధానం వైఫల్యాలు నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో అసలు హెూం మంత్రి అనే వారు ఉన్నారా, హెూం మంత్రి పేరు రాష్ట్ర ప్రజలకు తెలుసా.. అని ప్రశ్నించారు. నేరాలు అరికట్టడంపై హెూం మంత్రి ఒక్కసారైనా అ శాఖాధికారులతో రివ్యూ చేసిన సంఘటనలు ఇంత వరకు జరగలేకపోవడం వలనే రోజురోజుకు రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయన్నారు. వైసీపీ పాలనలో మంత్రులకు, శాఖలపై పట్టు లేదని, నిర్ణయాలు తీసుకునే అధికారం కూడా లేకపోయిందని, గతంలో ఈ పరిస్థితులు ఉండేవి కాదన్నారు. పలాసలో భారీ అవినీతికి పాల్పడిన తహశీల్దార్‌పై కూడా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వారి పాలనకు నిదర్శనమన్నారు. వ్యవస్థలో సంపూర్ణ మార్పుకు సుపరిపాలనకు జనసేన, టీడీపీ పొత్తుతో రాష్ట్రంలో అధికారంలోకి రావాల్సి ఉందని అన్నారు. తహశీల్దార్ హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

వాలంటీర్ శాంతి సతీష్ సేవలపై హర్షం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని జగతి గ్రామం శమళ్ళవీధికి చెందిన శమళ్ళ మన్మధరావు గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో శ్రీకాకుళం మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుండగా జగతి సచివాలయంకు సంబంధించిన గ్రామ వాలంటీర్ పిరియ శాంతి సతీష్ శ్రీకాకుళం వెళ్లి పెన్షన్ అందజేసింది. అలాగే దిక్కల ప్రభావతి గత కొంతకాలంగా టెక్కలిలో ఉంటూ వైద్యం పొందుతుంది. వాలంటీర్ శాంతి టెక్కలి వెళ్లి పెన్షన్ అందజేసింది. ఈ సందర్భంగా ఆమె సేవలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం జగతి గ్రామానికి చెందిన పిరియ శాంతి గ్రామ వాలంటీర్ 130 కిలోమీటర్లు దూరంలో ఉన్న మెడికవర్ ఆస్పత్రికి వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మన్మధరావు,టెక్కలిలో ఉన్న ప్రభావతి కు సకాలంలో పింఛన్ అందజేసి బాసటగా నిలవడంతో వైస్ ఎంపీపీ పూడి నేతాజీ, స్థానిక సర్పంచ్ పూడి వరప్రసాద్, గ్రామస్తులు, సంబంధిత కుటుంబసభ్యులు వాలంటీర్ సేవలపై హర్షం వ్యక్తం చేశారు.

బాబు షూరిటీ... భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం

విశాలాంధ్ర-జలుమూరు : మండలం పాగోడు గ్రామ పంచాయతీలో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా 42వ బూత్ నెంబర్లలో అధ్యక్షులుగా ఉన్న దుబ్బ రామారావు ఇంటింటికి వెళ్లి వాళ్ళ యొక్క డీటెయిల్స్ తెలుసుకొని ఆదివారం 20 కుటుంబాలను నమోదు చేయడం జరిగిందని, ఇందులో సీనియర్ నాయకులు కింజరాపు ప్రకాష్ రావు, దుబ్బ రామారావు, బి. బాలకృష్ణ, (కుర్మనదపురం)మరియు కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారని టీడీపీ నాయకులు తెలియజేశారు.

ఆటో బోల్తా : 15 మందికి గాయాలు

విశాలాంధ్ర-మందస : మండలం హరిపురం జాతీయ రహదారిపై ఆదివారం అదుపు తప్పి ఆటో వరద కాలువలో బోల్తా పడడంతో 15 మందికి స్వల్ప గాయాలయ్యాయి. సంతబొమ్మాళి మండలం మర్రిపాడు గ్రామానికి చెందిన కొంతమంది కవిటి మండలం బొరివంకలో గల అమ్మవారిని దర్శనం చేసుకొని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ సమయంలో అటువైపు వెళ్తున్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషా ఆటో ప్రమాదాన్ని గమనించి వారి వద్దకు చేరుకొని క్షతగాత్రులను మనోధైర్యం కల్పించారు. 108కు ఫోన్ చేసి గాయపడిన వారిని హరిపురం ప్రభుత్వాసుపత్రికి దగ్గరుండి తరలించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చు కున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మందస పోలీసులు తెలిపారు.

దివ్యాంగుల పెన్షన్ పెంచరా...

విశాలాంధ్ర-కొత్తూరు... దివ్యాంగుల పెన్షన్‌ను పెంచరా ఎప్పుడు పెంచుతారని పలువురు దివ్యాంగులు ప్రశ్నిస్తున్నారు. సాధారణ సామాజిక పెన్షన్లు రెండువేల రూపాయిలు ఉన్నప్పుడు దివ్యాంగుల పెన్షన్ మూడు వేల రూపాయిలు ఉండేది. ఇప్పుడు సాధారణ సామాజిక పెన్షన్లు మూడు వెలరూపాయిలకు ప్రభుత్వం పెంచింది. ఈ పరిస్థితుల్లో మాకు ఇస్తున్న పెన్షన్ 3వేల నుండి 4వేల రూపాయిలకు పెంచాలని పలువురు దివ్యాంగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు .తమది న్యాయమైన డిమాండ్ అని దివ్యాంగులు అంటున్నారు ప్రభుత్వం తమ డిమాండ్‌ను పరిశీలించాలని వారు కోరుతున్నారు.

రమణయ్య హత్య కిరాతకం

విశాలాంధ్ర-టెక్కలి: తహసీల్దార్ సనపల రమణయ్య హత్య అత్యంత కిరాతకమని ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి టెక్కలి సమితి మాజీ కార్యదర్శి గున్న ప్రసాదరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఉద్యోగ బాధ్యతలు ఖరాకండిగా నిర్వర్తించే క్రమంలో ఎవరికైనా ఇబ్బంది కలిగితే పై అధికారులను సంప్రదించాలే తప్ప భౌతిక దాడులకు పాల్పడడం మూర్ఖత్వమేనన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబానికి ఏంచెప్పి సమాధాన పరచగల మన్నారు. జీతాలకేకాక జీవితాలకే గ్యారెంటీలేని వ్యవస్థలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను నివారించవచ్చును

డా॥ దివ్య - డా.కావ్యశ్రీ

విశాలాంధ్ర-ఎల్ఎన్‌పేట: లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఆదివారం కస్తూర్బ పాఠశాల ఆవణలో జెమ్స్‌హాస్పిటల్ (రాగోలు) ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో డాక్టర్స్ దివ్య- కావ్యశ్రీ,ఏరియా మేనేజర్ కె.సంతోష్, పిఆర్‌ఓ కె.అర్విండ్, లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్, దివ్యాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు, సక్షం జిల్లా కన్వీనర్,ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత,సీఫ్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ లయన్ డా.ఎం.కె మిశ్రో, కస్తూర్బపాఠశాల టీచర్ ఎ.లక్ష్మి,జెమ్స్ హాస్పటల్ సిబ్బంది, విద్యార్ధినులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర-టెక్కలి : టెక్కలి నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా సైనికుల ఆత్మీయ సమావేశం టెక్కలి ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్సీపీ పార్టీ సోషల్ మీడియా విభాగాన్ని మరింతగా బలోపేతం చేస్తూ ప్రభుత్వం చేపట్టే పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలలో చైతన్యం కలిగించేల కృషి చేయాలని తగు సలహాలు సూచనలు అందించారు.

శాఖా గ్రంథాలయానికి చేరుకున్న పోటీ పరీక్షల పుస్తకాలు

విశాలాంధ్ర-జలుమూరు/సారవకోట: శాఖ గ్రంథాలయానికి పలు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు చేరాయని గ్రంథ పాలకురాలు డి. సాయమ్మ తెలిపారు. గ్రూప్-1, డీఎస్సీ, రైల్వే గ్రామ, వార్డు సచివాలయ పోస్టులకు సంబంధించి పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు వచ్చాయని తెలిపారు. నిరుద్యోగులకు అందుబాటులో ఉండే విధంగా ఉంచడం జరిగిందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీవామృతం పిచికారితో చెరుకు సాగు

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఆమదాలవలస మండలం చేపేనపేట క్లస్టర్ నిమతుర్లవాడ గ్రామంలో పలువురి చెరుకు సాగు చేస్తున్న రైతులతో తక్కువ ఖర్చుతో జీవామృతం తయారు చేసి వాటిని పంట పొలంలో పిచికారి చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నక్క చిరంజీవి వివ రించారు. తక్కువ ఖర్చుతో భూమికి కావ లసిన సూక్ష్మ పోషకాలను అందించడంలో జీవామృతం ఎంతో దోహదపడుతుందని వీటి తయారీ కూడా ఎటువంటి డబ్బులు ఖర్చు అవ్వని ప్రతి రైతు వీటన్ని తయారు చేసుకోవచ్చని చిరంజీవి వివరించారు.

విశ్వాసంతో ముమ్ముందుకు..

విశాలాంధ్ర-పోలాకి : విశ్వాసమే ముమ్ముందుకు వెళ్తున్నట్లు బ్రహ్మకుమారి గణపతి (గద్దయ్య) అన్నారు. ఆదివారం బెలమరలో జరిగిన బ్రహ్మకుమారిస్ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సత్యంతోనే జగమంతా నడుస్తుందని విశ్వాసంతోనే ముమ్ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా మనసులో సత్ప్రవర్తన కలుగుతున్నట్లు అన్నారు. ఎంతోమంది వక్తుల అభిప్రాయం ఇదేనని ఉద్ఘాటించారు. బ్రహ్మకుమారి దేవి మాట్లాడుతూ అనేక ప్రాంతాలలో ప్రజల చైతన్యం కోసం ఆధ్యాత్మిక ప్రసంగాలు ఇస్తున్నట్లు చెప్పారు. ఎంతో స్ఫూర్తి పొంది చైతన్యంతో ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి సరోజినీ మాతతో పాటు అనేక ప్రాంతాల నుంచి వక్తలు ఆధ్యాత్మిక ప్రియులు మూల భీమారావు వెలమల వాసుదేవరావు గాతలవలస వేణుగోపాలరావు ఆధ్యాత్మిక ప్రియులు పాల్గొన్నారు.

కొత్తూరు ఆర్టీసి కాంప్లెక్స్ అవరణలో ఇతర వాహనాలు రాకపోకలు

ప్రయాణికులకు ఇబ్బందులు ప్రమాదాలకు ఆస్కారం

విశాలాంధ్ర-కొత్తూరు : ఎక్కడైనా ఆర్టీసి కాంప్లెక్స్ అవరణలో ఆర్టీసికి సంబంధించి బస్సులు మినహా ఇతర వాహనాల రాకపోకలు నింబందనల మేరకు నిషేధం ఎందుకంటే కాంప్లెక్స్‌లో బస్సులు కోసం ఎదురు చేస్తున్న ప్రయాణికులు. బస్సులు రాగానే ఉరుకులు, పరుగులు తీస్తారు. ఈ గాబరాలో ప్రైవేట్ వాహనాలు ఈ అవరణ గుండా వస్తే ప్రమాదాలకు ఆస్కారం అందుకే ఆర్టీసి కాంప్లెక్స్ అవరణలో ప్రైవేట్ వాహనాల రాకపోకలు నిషేధం కానీ కొత్తూరు ఆర్టీసి కాంప్లెక్స్ అవరణ గుండా ప్రైవేట్ వాహనాలు యాథచ్ఛగా రాకపోకలు సాగిస్తుంటాయి. అదే సమయంలో కాంప్లెక్స్‌లోకి బస్సులు కోసం వేచిచూసే ప్రయాణికులు బస్సులు కాంప్లెక్స్‌లోకివస్తే పరుగులు తీస్తారు. నింబంధనాల మేరకు ప్రైవేట్ వాహనాలు రాకపోకలు నిషేధం నిబంధన విధిగా పాటించాలని పలువురు కోరుతున్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విజేతలకి ప్రసంసాపత్రాలు అందజేత

విశాలాంధ్ర-జలుమూరు : జలుమురు మండలం లో మండల లెవెల్ ఫిజికల్ టేలెంట్ టెస్ట్ పదవ తరగతి విద్యార్థులు కి జెడ్పీహెచ్ఎస్ లింగాలవలస లో నిర్వహించారు. ఈ పోటీ పరీక్ష కి 16 పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. తెలుగు మాధ్యమం లో ప్రథమ ద్వితీయ స్థానాలలో జెడ్పీహెచ్ఎస్ పెద్దదూగంకి, ఇంగ్లీష్ మీడియంలలో ప్రథమ ద్వితీయ స్థానంలో ఏపీఎంఎస్ కరవంజ సాధించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బమ్మిడి మాధవరావు, ఇతర స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండి క్యాన్సర్‌ని నివారిద్దాం

విశాలాంధ్ర-పలాస : యువత మత్తు పదార్థాలకు, మద్యపానానికి దూరంగా ఉందాం.. క్యాన్సర్ నివారిద్దామని జేమ్స్ ఆసుపత్రి మేనేజర్ చిన్నారావు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్‌లు అన్నారు. ఆదివారం యువత మత్తు మద్యపానానికి దూరం ఉందాం క్యాన్సర్ నివారిద్దాం అనే నినాదంతో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో పలాస రామకృష్ణ నరేంద్ర సేవా సమితి గ్రీన్ ఆర్మీ క్యాజు ల్యాండ్, ప్రశాంతి సత్యసాయి సేవా సమితి, జేమ్స్ రాగోలు ఆసుపత్రి సంయుక్తంగా పలాస ఇందిరాగాంధీ బొమ్మ జంక్షన్ నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు యువత, విద్యార్థులు, ప్రజలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలాస బత్తులవీధి రామకృష్ణ నరేంద్ర సేవా సమితి ఆవరణలో జేమ్స్ రాగోలు ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా జేమ్స్ ఆసుపత్రి మేనేజర్ చిన్నారావు మాట్లాడుతూ అవగాహన సదస్సులు ప్రజలకు మేలు చేస్తాయని అన్నారు. అలాగే గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు జోలికి వెళ్లకుండా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. క్యాజు ల్యాండ్ మల్ల జయశ్రీ మాట్లాడుతూ మహిళలు ఈ వ్యాధిపట్ల అవగాహన ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రశాంతి సేవాసమితి జామి మోహనరావు, గ్రీన్ ఆర్మీ గౌరవాధ్యక్షులు బత్తిని ఓంకార్, రాముపాత్రో, నీలకంత పాత్రో, భాస్కర్, ఆర్.సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు దాసరి శ్రీనివాసరావు, బోకర దుర్యోదన, గేదెల జగదీష్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు అసపన మధుబాబు, ఇరిగేషన్ అధికారి పి.శ్రీనివాసరావు, ఇచ్ఛాపురం ప్రదీప్, జేమ్స్ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలి

వైకాపా శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు పేరాడ తిలక్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : నాయకులు, గ్రామ పెద్దలు, స్వచ్ఛంధ సంస్థల ద్వారా గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహాయసహకారాలు అందించాలని రాష్ట్ర కళింగ కార్పోరేషన్ చైర్మన్, వైకాపా జిల్లా పార్లమెంటు సభ్యులు పేరాడ తిలక్ అన్నారు. ఆదివారం మండలం మాసాహెబ్‌పేట పంచాయతీ, కమలనాభపురం గ్రామంలో రాష్ట్ర కళింగ కర్పోరేషన్ డైరెక్టర్, సర్పంచ్ సంపతిరావు హేమసుందరరాజు ధనలక్ష్మిల కుమార్తె కుమారిశ్రీ జ్ఞాపకార్థం ఏర్పటు చేసిన కుమారిశ్రీ చారిటిబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంచినీటి వాటర్ ప్లాంట్ (ఆర్‌వో)కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలకు మంచినీరు, మంచి భోజనం, ప్రశాంత వాతావరణ అవసరమని, మన గ్రామాల్లో వాటర్‌లో ప్రాబ్లం ఉండటంవల్ల ఎక్కువ మంది ప్రజలు కిడ్నీవ్యాధి బారిన పడుతున్నారని, అలాటివారిని దృష్టిలో పెట్టుకొని తన కుమార్తె జ్ఞాపకార్థం పలువురు సహాయంతో ఈ మంచినీటి పథకం పెట్టి ప్రజలకు సురక్షమైన మంచినీటిని అందించాలని ఉద్దేశ్యం మంచిదని, ఈ పథకం ద్వారా ప్రజలకు మంచినీరు అందితే తన కుమార్తె బ్రతికి ఉన్నట్టేనని ఆయన అన్నారు. ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహించాలంటే రాజు ఒక్కడవల్ల కాదని దీనికి పలువురు సహాయం అందించాలని ఆయన కోరారు. ఈప్లాంటు నిర్మాణానికి ఉచితంగా స్థలం అందించిన దుంపల ధర్మారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రోణంకి ఉమామల్లేశ్వర రావు, జడ్పీటీసి దుబ్బ వెంకటరావు, వైకాపా నాయకులు అన్నెపు రామారావు, నూక సత్యరాజు, కవిటి రామరాజు, గద్దవలస నాగభూషణరావు, పేదాడ వెంకటరావు, గురువెల్లి కేశవరావు, బగాది దివాకర్, సనపల క్రిష్ణమూర్తి, బమ్మిడి గణపతి, హనుమంతు గోవింద్, బోనేల ఎల్లయ్య, మెండ తాతయ్య, సింగుపురం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల నాయకుడు మడ్డు రాంబాబు

విశాలాంధ్ర-పలాస: పీడిత ప్రజల కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరుల పోరాట స్ఫూర్తిని నింపుకొని వాళ్ల బాటలో కామ్రేడ్ మడ్డు రాంబాబు నడిచారని, ఆయన పీడిత ప్రజల పక్షాన పోరాడి కూడు గూడు లేని ప్రజల కోసం పోరాడిన వారిని ఆదరించి ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయే నాయకుడుగా ఎదిగారని సిపిఐ యం యల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గౌరకల బాలకృష్ణ అన్నారు. ఆదివారం విప్లవ ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మండలం అకుపల్లిలో నిర్వహించిన కామ్రేడ్ మడ్డు రాంబాబు స్మారక సభలో పాల్గొన్నారు. ఈసందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉద్యమ పోరాటంలో రాంబాబు అందరికీ ఉద్యమ బంధమయ్యాడని, ఆయన నడిచే బాటలో మరింత పోరాట దీక్షతో సాగడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. విప్లవకారుల ఐక్యతను ఎల్లప్పుడూ కోరుకునేవారని, ఈరోజు రాంబాబును స్మరించుకోవడం అంటే అమర స్ఫూర్తిని అమరుల ఆశయాలనుకొనసాగించడమేనన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ మాట్లాడుతూ ఉద్దానంలో బొడ్డపాడు తరువాత అక్కుపల్లి గ్రామంలోనే విప్లవ పార్టీల కార్యకర్తలు ఎక్కువగా ఉండే గ్రామంగా చరిత్రకెక్కిందనీ విప్లవోద్యమంలో పేరు పొందిన అమరులు పొట్లూరి రామ నరసయ్య , కామ్రేడ్ కుమారన్న ,జయక్క, చంద్రక్క నడయాడిన ఉద్దానం గ్రామాల్లో ఎంతో మంది కామ్రేడ్స్ తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. వారందరి బాటనే రాంబాబు అనుసరించారన్నారు. ఈసభకు మడ్డు అనిల్ అధ్యక్షత వహించగా పలు ప్రజా సంఘాల నాయకులు కోనేరు గురయ్య, రాపాక మాధవరావు, కుత్తుమ హేమక్క కుత్తుమ జానకమ్మ, జె. అప్పయ్య, బైరాగి, భాస్కర్‌రావు, మడ్డు రాఘవులు, కె.భీమా రావు, వొట్టి మల్లేష్, జె.సోమేశ్వరరావు తదితరులు మడ్డు రాంబాబుకు నివాళులర్పించారు.

వైఎస్సార్సీపీలోకి భారీగా చేరికలు...

సాయిరాజ్ సమక్షంలో తేదేపా నుండి 500 కుటుంబాలు వైఎస్సార్సీపీలో చేరిక....

విశాలాంధ్ర-కవిటి : రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనచ్చి కవిటి మండలంలో తెదేపా నుండి 500 కుటుంబాలు ఇచ్ఛాపురం నియోజకవర్గం మాజీ జడ్పీ చైర్పర్సన్ విజయ,మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ సమక్షంలో 500 కుటుంబాలు వైఎస్ఆర్సిపి పార్టీలోకి చేరాయి. ఈమేరకు ఆదివారం శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ పిరియా విజయసాయిరాజ్ ఇచ్ఛాపురం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్‌తో కలసి కవిటి మండలం కవిటి మేజర్ పంచాయితీ పరిధిలో తొత్తూరుపుట్టుగ గ్రామంలో ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక సమావేశంలో జడ్పీ చైర్పర్సన్ విజయ సాయిరాజ్, ఇచ్ఛాపురం నియోజకవర్గం మాజీ శాసనసభ్యుడు పిరియా సాయిరాజ్ సమక్షంలో కవిటి మండలం పి.తొత్తుడు పుట్టుగ,ఆర్ తోత్తుడు పుట్టుగ, గోదావీధి, జన్నివీధి, పెంటవీధి, గోనియవీధి గ్రామాలకు చెందినటువంటి సుమారు 500 కుటుంబాలు టిడిపి నుండి వైస్సార్సీపీ పార్టీలోకి చేరారు. ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధిని మెచ్చి పార్టీలో చేరుతున్నట్లు నూతనంగా చేరిన కుటుంబ సభ్యులు తెలిపారు. సంబంధిత కుటుంబ సభ్యులకు వైసిపి కండువాలు వేసి 500 వందల కుటుంబాలని పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా పార్టీలోకి నూతనంగా వచ్చినవారి రాకపట్ల జడ్పీ చైర్పర్సన్ విజయసాయిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు, పూడి నీలాచలం, కృష్ణా రౌలో, సత్యన్నరాయణ పాడి, బర్ల నాగభూషణ్ రెడ్డి, సనపల జానకిరావు, సనపల కృష్ణారావు, రవి ప్రధాన్, బడ్డాయి మురళి, దుద్ది ధర్మారావు, ఎన్ని అశోక్, నీలయ్య ఏ మధు,కె జయరాం, పిన్నింటి జయరావు, పి.లక్ష్మణమూర్తి, మండల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసి చట్టాల సాధనకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలి

విశ్రాంత ఐఏఎస్ అధికారి బాబురావునాయుడు

విశాలాంధ్ర-మెళియాపుట్టి:ఆదివాసీయుల హక్కులు, చట్టాలు నేటు చాలావరకు అమలు జరగడంలేదని వాటి సాధన కోసం ఆదివాసిలంతా ఒక్క తాటిపైకి వచ్చి సాధించుకోవడంతోపాటు, మన మన భవిష్యత్ తరాలవారికి సైతంవాటిని అందించవలసిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మండల కేంద్రంలోని ఆదివాసీ (గిరిజన) చైతన్య వేదిక, ఆదివాసీసేన తదితర సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నాడు బహిరంగ సభను నిర్వహించారు. విశ్రాంత అధికారి బాబురావు నాయుడు, ప్రతి ఒక్క గిరిజనుడు ఆదివాసీ హక్కులను గూర్చి సంపూర్ణంగా తెలుసుకోవాలన్నారు. గోండ్వానా దండకారణ్య పార్టీ రాష్ట్ర నాయకులు మడకం వెంకటేశ్వర రావు, తెలంగాణా న్యాయవాది ఉశే రవిలు మాట్లాడుతూ గత కొంతకాలంగా ఆదివాసీలకు అన్యాయం జరుగడంతోపాటు వారి హక్కులను సైతం నిర్వీర్యం చెందుతున్నాయని వాటి కొరకు తీవ్రస్థాయిలో ఉద్యమించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అంతేకాకుండా ప్రస్తుత రాజకీయ నాయకులు ఆదివాసీలను ఓటు బ్యాంకు రాజకీయాలకై వినియోగించుకుంటున్నారు తప్పితే అభివృద్ధి దిశగా తీసుకుపోవడం లేదన్నారు. జిల్లాలో అగ్రకులాలకు గిరిజన రిజర్వేషన్లను అందివ్వడం ద్వారా గిరిజనలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, గిరిజనులకు అన్యాయానికి గురిచేసే వారిని మూకుమ్మడిగా బుద్ధి చెప్పవలసిన సమయం వచ్చిందన్నారు. అనేక అంశాలపై పలువురు వ్యక్తులు ఈ బహిరంగ సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో వారితో పాటు ఆదివాసీ గిరిజన చైతన్య వేదిక సభ్యులు సవర చొక్కారావు, వరహాల కృష్ణారావు, పలువురు గిరిజన సంఘ నాయకులు, మహిళలు, సవర జగన్, సవర రాంబాబు, లక్ష్మీపురం కిరణ్, తదితరులున్నారు.

సమరశీల పోరాటాలతోనే విద్యారంగ సమస్యల పరిష్కారం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: సమరశీల పోరాటాలతోనే విద్యారంగాన్ని కాపాడుకోవాలని, విద్య రంగ అభివృద్ధి తోనే దేశ ఆర్థిక సాంస్కృతిక నాగరిక అంశాలు ముడిపడి ఉన్నాయని, శాస్త్రీయమైన విద్యారంగ అభివృద్ధి ధ్యేయంగా ఏపీటీఎఫ్ పనిచేస్తుందని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో గల జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఏపీటీఎఫ్ విస్తృత జనరల్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా శాఖ అధ్యక్షులు మజ్జి మదన్ మోహన్ అధ్యక్షతన నిర్వహింపబడిన ఈ జనరల్ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి ధవళ సరస్వతి లు మాట్లాడారు. జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి బల్ల సుభాష్ బాబు గత రెండేళ్ల కాలంలో ఏపీటీఎఫ్ చేపట్టిన కార్యక్రమాలు చేసిన పోరాటాలు గురించి వివులంగా నివేదిక ప్రవేశపెట్టారు. అనంతరం ప్రధాన కార్యదర్శి నివేదికపై చర్చ జరిగింది నివేదికను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా మజ్జి మదన్మోహన్, ప్రధాన కార్యదర్శిగా ఎస్ వి అనిల్ కుమార్, ఉపాధ్యక్షులుగా పి అప్పలనాయుడు, బి.ఢిల్లేశ్వర్‌రావు, జి భీమారావు, టి.రాజ్యలక్ష్మి, కే గోపికృష్ణ, బి.నేతాజీరావు (ప్రత్యేక ఆహ్వానితులు) కార్యదర్శులుగా, చావలి శ్రీనివాస్, ఎస్ చాణిక్య, వి నవీన్‌కుమార్, దాసరి రామ్మోహనరావు, మక్కా గంగేశ్వరి, పప్పల తిరుమలరావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా బల్ల సుభాష్ బాబు, పైడి శ్రీరామమూర్తి, డి చంద్రశేఖర్, ఎన్ శ్రీనివాసరావు, బొంతు అప్పలనాయుడు, జి రాజేష్, కె విజయ్‌కుమార్, బి శాంతి, ఎన్ నీలా మోహన్, కె.శాంతారామ్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా టి సూర్యనారాయణ, ఆడిట్ కమిటీ సభ్యులుగా డి శ్రీనివాసరావు, ఎస్ రామారావు, అకడమిక్ కమిటీ కన్వీనర్ గా ఎల్ కరుణాకర్, సభ్యులుగా ఎన్.వి.ఎస్.ప్రసాద్, ఎం.శ్రీనివాస్, సిహెచ్ వెంకటేశ్వరరావు, పి.మోహన్‌రావు, ఎస్ జగన్నాయకులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.త్రినాధరావు వ్యవహరించారు. రాష్ట్ర పరిశీలకులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి వ్యవహరించారు.

సోంపేట జోన్ శ్రీసత్యసాయి సేవా సంస్థల సమావేశం

విశాలాంధ్ర-సోంపేట : శ్రీసత్యసాయి సేవా సంస్థల సోంపేట జోన్ సమావేశం ఆదివారం స్థానిక శ్రీసత్యసాయి దివ్య మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో భవిష్యత్తులో నిర్వహించబోయే పలు సేవా కార్యక్రమాలు, ఇంటింట భజనలు, కోటి మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపడతామని పలవురు సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు ఎన్ని లింగరాజు, సేవాదళ్ ఇన్‌చార్జ్ రామచంద్రరావు, ఆధ్యాత్మిక సమన్వయకర్త అనాధ గుప్తా, జిల్లా జాయింట్ యూత్ కోఆర్డినేటర్ ఈపరి రవికుమార్, జోనల్ కన్వీనర్ కందుల కాశీ, సమితి కన్వీనర్ టంకాల బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ మేథోత్సవం టాలెంట్ టెస్ట్

విశాలాంధ్ర-కవిటీ : మండల కేంద్రమైన కవిటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో సైన్స్ మ్యాథోత్సవం ప్రతిభా పరీక్ష ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలుగు,ఇంగ్లీష్,ఒరియా మీడియంకు సంబంధించి మండలంలోని వివిధ జిల్లా పరిషత్, ప్రభుత్వ, మోడల్, కేజీబీవీ, ఉన్నత పాఠశాల నుండి 80 మంది విద్యార్థులు హాజరయ్యారు.ఈ మేరకు కవిటీ మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి కి కవిటీ మండల ఫిజిక్స్ ఫోరం తరఫున ఘనంగా సన్మానించారు.అనంతరం ఎంఈఓ ధనుంజయ మజ్జి, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పట్ల ఆసక్తి పెంచుకోవాలని కోరారు. అనంతరం మూడు మీడియంలో గెలు పొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కవిటీ మండల ఫిజిక్స్ ఫోరం అధ్యక్షులు కే.రామారావు, ప్రధాన కార్యదర్శి పి వేణుగోపాల్, కోశాధికారి జయరాం, కన్వీనర్ వెంకటరావు, మహిళా కార్యదర్శి రాధిక, కవిటీ మండల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: నగరంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆక్స్ఫర్డ్ స్కూల్‌లో రెండు రోజులపాటు జరుగనున్న మెగా సైన్స్ ఫెయిర్ ఆదివారం అట్టహాసంగా ప్రారంభం అయింది. రికార్డ్ స్థాయిలో ఒకే స్కూల్ నుంచి మొత్తం 554 మంది విద్యార్థులు 335 ప్రాజెక్ట్ ను ప్రదర్శించడం విశేషం. పైగా నామమాత్ర డిస్ప్లే మోడల్స్ కాకుండా వందకు వంద శాతం వర్కింగ్ మోడల్స్ ప్రదర్శించడం మరో విశేషం. తాము నేర్చుకున్న అంశాలకు తోడు తమ ఆలోచనలకు పదునుపెట్టి ప్రోజెక్ట్‌ల రూపంలో ప్రదర్శించారు. నిత్య జీవనంలో ఎదురయ్యే చాలా సమస్యలకు పరిష్కారం చూపే ప్రాజెక్టులు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జిల్లా విద్యా శాఖాధికారి వెంకటేశ్వర రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రోజెక్ట్ లను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కేవలం ఒకే స్కూల్ నుంచి 335 ప్రోజెక్ట్ లు, అదీ అన్ని వర్కింగ్ మోడల్స్ ప్రదర్శించడం సామాన్యమైన విషయం కాదన్నారు. పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందిచాల్సిన అవసరం తల్లి తండ్రులతో పాటు ఉపాధ్యాయుల పైన కూడా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ అన్నేపు లావణ్య రాణి, ప్రిన్సిపల్ కిరణ్ కుమార్, సైన్స్ ఫెయిర్ ఇంఛార్జి సౌజన్య, కో ఆర్డినేటర్ లు దీపా కుమారి, దేవి, విజయ తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ ఆధ్వర్యంలో డీపీఆర్‌వో రమేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : సమాచార శాఖలో ఆణిముత్యం రమేష్. డిపిఆర్ఓగా పనిచేసి సిక్కోలు జిల్లా ప్రగతికి బాటలు వేసిన లోచేర్ల రమేష్ అందరి అభిమానాన్ని ఆప్యాయతను చూరగొన్న ఏకైక వ్యక్తి గా నిలుస్తారని పలువురు నడక సంఘాల నేతలు కొనియాడారు. సమాచార పౌర సంబంధాల శాఖలో రమేష్ ఆణిముత్యం లాంటి వారని ప్రశంసించారు. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధిలో రమేష్ అమోఘమైన పాత్ర పోషించారని అన్నారు. ఆదివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్ స్ క్లబ్ ఆధ్వర్యంలో పార్వతీ పురం మన్యం జిల్లా సహాయ సంచాలకులు గా పదోన్నితి పై వెళ్ళిన లోచెర్ల రమేష్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాకుళం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పథక సంచాలకులు డాక్టర్ డి వి. విద్యాసాగర్ మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు ఎల్లప్పుడూ ప్రజాదరణ ఉంటుందని ఈవిషయంలో రమేష్ అభిమానులు తార్కాణం అని అన్నారు. జిల్లాలో సుమారు పదేళ్ల పాటు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిగా పనిచేసి జిల్లా అభివృద్ధికి బాటలు వేసే కలెక్టర్లు కు చక్కని సూచనలు సలహాలు ఇచ్చి నడిపించిన వారిలో రమేష్ అగ్ర గణ్యులుగా పేరు గాంచారని కొనియాడారు. సంపూర్ణ ఆరోగ్యానికి నడక వ్యాయామము ఎంతో ఉపకరిస్తాయని ఈ రెండూ స్టార్ వాకర్ స్ క్లబ్‌లో లభిస్తాయన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ జన్మదిన వేడుకల్లో పెద్ద ఎత్తున నడక సంఘాల నేతలు సభ్యులు పాల్గొన్నారు. ముందుగా రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని జంబో డాన్స్ బృందం చక్కని ఆరోగ్యానికి పది సూత్రాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్ స్ క్లబ్ ప్రతినిధులు జి. ఇందిరా ప్రసాద్, పి.జి.గుప్తా, ఎస్. జోగినాయుడు, బి వి. రవిశంకర్, బి. దేవీ ప్రసాద్, గోలీ ఉమా మహేశ్వర రావు, ఎం. మల్లి బాబు, గురు ఆనందరావు, గేదెల లక్ష్మీ, రామ్‌బాయి, వై.మోహన్, నాగేశ్వర ఈశ్వరరావు, శ్రవంతి, సుగంధం సంజీవరావు, డాక్టర్ జి.నారాయణరావు, చలపాక సూర్యారావు, బొంగు సత్యనారాయణ, పి.నాగేశ్వరరావు తదతరులు పాల్గొన్నారు.

హత్యా దోషులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-పలాస : విశాఖ చిన్న కదిలి మండల తహసిల్దార్‌గా పనిచేసిన సనపల రమణయ్య దారుణ హత్యకు సంబంధించి దోషులను కఠినంగా శిక్షించాలని పలువురు డిమాండ్ చేశారు. హత్యకు నిరసనగా ఆదివారం రాత్రి కాంగ్రెస్ నాయకులు డా.జీవితేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు కాశీబుగ్గ మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నుండి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డా.దువ్వాడ జీవితేశ్వర రావు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరి, శ్రీకాంత్, కోత పూర్ణచంద్రరావులు నిజాయితీపరుడైన తహసిల్దార్ రమణయ్య తన విధి నిర్వహణలో అనేక మంది పేద ప్రజల సమస్యలను పరిష్కరించాలని అన్నారు వజ్రపు కొత్తూరు తహసిల్దార్ గా 2012లో పనిచేశారని ఆ సమయంలో అనేక మండల సమస్యలను పరిష్కరించారని గుర్తు చేశారు విశాఖ జిల్లాలో జరుగుతున్న భూదందాలను అరికట్టారని దీనిని కొంతమంది జీర్ణించుకోలేక హత్య చేశారని ఇది ప్రభుత్వ హత్యేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, బల్ల గిరిబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, దువ్వాడ శ్రీకాంత్, రామానంద స్వామి పాలవలస వైకుంత రావు డబ్బీరు నాగు, కంచరాన భుజంగరావు, సత్యానంద్, తదితరులు పాల్గొన్నారు.

శివసాగర్ తీరంలో క్రష్ లవ్ మూవీ షూటింగ్

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : మండలం అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో ఆదివారం ప్రముఖ సినీ నిర్మాణ సంస్థ ఆశ్యన్ ఎంటర్టైన్మెంట్ ఆధ్వర్యంలో క్రష్ లవ్ మూవీ షూటింగ్ జరిగింది.ఈ చిత్రానికి కథ స్క్రీన్ ప్లే దర్శకత్వం సిమ్ము వహిస్తున్నారు. ఉత్తరాంధ్ర ప్రముఖ సినీ నటులు అమ్మరామకృష్ణ హీరో కౌశిక్ హీరోయిన్ సాహితీ శ్రీనివాస్ లపై సన్నివేశాన్ని సముద్ర తీరంలో చిత్రీకరించారు. నిర్మాత శివాని కావూరి,నటులు జామి శ్రీను,కోరాడ రాంప్రసాద్ దుర్గా కాంత్ గ్రీన్ ఆర్మీ సభ్యులు దాసరి శ్రీనివాసరావు నగిరి లక్ష్మి హైమావతి తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రాంతానికి చెందిన నటుడు అమ్మ రామకృష్ణ పలాస ,జయమ్మ పంచాయితీ ,వీర గున్నమ్మ, పల్లె గూటికి పండగ వచ్చింది ,కట్టే కొట్టే తెచ్చే వంటి చిత్రాలలో వివిధ రకాల విలక్షణమైన పాత్రలో నటించి ప్రేక్షకులు మెప్పించారు. ప్రస్తుత చిత్రంలో ప్రతి నాయకుడు పాత్రలో నటిస్తున్నారు. మరెన్నో చిత్రాలలో మంచి పాత్రలతో సినీ రంగంలో రాణించాలని గ్రీన్ ఆర్మీ టీం అధ్యక్షులు బోనేల గోపాల్ ఇతర సభ్యులు ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సినిమాకు సినీ ఫోటోగ్రాఫర్‌గా పలాస వాసి పవన్ కందికుప్ప మంచి అవకాశాలు అందిపుచ్చుకొని సినీ రంగంలో రాణించాలని వారు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓటమి భయంతోనే తిలక్‌పై విమర్శలు

విశాలాంధ్ర-నందిగాం : వైసీపీ శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థి తిలక్ మీద టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి శాసనసభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే వైసీపీ శ్రీకాకుళం పార్లమెంట్లో గెలుస్తాదనే భయం పుట్టుకొచ్చి అచ్చన్నాయుడు ఇలాంటి అర్థరహిత వ్యాఖ్యలు చేశారని నందిగాం ఎంపీటీసీ అంబోధి విష్ణు, హరిదాసు పురం సర్పంచ్ కనితి నారాయణమూర్తి, కర్లపూడి సర్పంచ్ తమెరరాజు ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వీడియో సందేహం విడుదల చేశారు. అచ్చం నాయుడు పదజాలం చూస్తే దారుణంగా ఉంటుందని తిలక్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినప్పటికీ తిలక్ అసభ్య పదజాలం వాడలేదని ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. అసభ్య పదజాలంతో రెచ్చిపోతే ప్రజలు ఓట్లు వేయరని అచ్చన్నకు బుద్ధి చెప్పడానికి జిల్లా ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. స్థానిక టిడిపి నందిగామ మండల అధ్యక్షుడు ఏదో నోటికి వచ్చింది మాట్లాడుతున్నారని అది సబబు కాదని దిమ్మలాడు సొసైటీలో మీరు చేసిన అవినీతి ఇప్పటికీ ప్రజలు మాట్లాడుకుంటున్నారని విమర్శించారు. పినకాన అజయ్ కుమార్ చేసే అవినీతి చిట్టా మా దగ్గర ఉందని చర్చకు రావడానికి మీరు సిద్ధమా అని ప్రశ్నించారు. ఒక ఎంపీ అభ్యర్థి పై విమర్శలు చేసే ముందు నిజానిజాలు తెలుసుకోవాలని అర్థరహితమైన విమర్శలు చేస్తే ప్రజల నమ్మరని అన్నారు. టెక్కలి ఎమ్మెల్యే, శ్రీకాకుళం ఎంపీ స్థానం వైసీపీ విజయం సాదిస్తుందని, అది తెలిసి టీడీపీ నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని, టీడీపీకి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ నాయకులు తిలక్ మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు.

ఉషోదయ యువజన సంఘం భవనానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-కవిటి : మండల కేంద్రమైన కవిటిలో ఉషోదయ యువజన సంఘం నూతన భవనానికి జడ్పీ చైర్పర్సన్, నియోజకవర్గ ఇన్చార్జ్ పిరియా విజయ సాయిరాజ్ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు ఆదివారం కవిటి లో జిల్లా పరిషత్ నిధులు 10 లక్షల రూపాయలతో ఉషోదయ యువజన సంఘం నూతన భవనానికి జడ్పీ చైర్పర్సన్ పిరియా విజయ సాయిరాజ్ చేతులమీదుగా శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో యువజన సంఘాల పాత్ర కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యేలు పిరియ సాయిరాజ్, నరేష్‌కుమార్ అగర్వాల్, ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, స్వచ్ఛ భరత్ డైరెక్టర్ కృష్ణారావు రౌల్లో, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఉషోదయ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు బి చిట్టిబాబు, అధ్యక్షులు పాండవ చంద్రశేఖర్, ఏఎంసి వైస్ చైర్మన్ ఎలమంచి నీలయ్య, పిఎసిఎస్ డైరెక్టర్ ఎన్ని అశోక్, బద్రి ప్రకాష్, తమరాల జయరాం,పొల్లాయి ఉమామహేశ్వరరావు, ఉషోదయ యువజన సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

విశాలాంధ్ర-ఆమదాలవలస: ఆమదాలవలస పెన్షనర్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎంపిక ఏకగ్రీవంగా జరి గింది. ఆదివారం స్థానిక లక్ష్మీ నగర్ పాఠశాల ఆవరణలో సమావేశాన్ని నిర్వహించారు. నూతన కార్యవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యద ర్శిగా సురవరపు సిమ్మి నాయుడు, బొడ్డేపల్లి జనార్ధన రావు లను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. నూతన కార్యవర్గాన్ని హెచ్ వి సత్య నారాయణ ప్రతిపాదించగా, అప్పారావు బలపరిచి కౌన్సిల్ సమావేశంలో ఆమోదింప చేశారు. గౌరవ అధ్యక్షులుగా బొడ్డేపల్లి మోహనరావు, కోశాధికారిగా హెచ్ వి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పి.వైకుంఠరావు, డి.లక్ష్మణరావు, ఎం చంద్రశేఖర్, సత్యనారాయణ, షణ్ముఖరావు, బివి రమణలను ఎన్నుకోగా కార్యదర్శులుగా పివిఎస్ మాస్టారు, బానోజీరావు జనార్దన్‌రావు, నారాయణరావు, సత్యనారాయణ రాజారావును ఎంపిక చేశారు. మిగిలినవారిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ముందుగా ఆర్థిక నివేదికను, కార్యదర్శి నివేదికలను గత కార్యవర్గ ప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ ఫ్యాన్షనర్లకు రావ లసిన 185 నెలల డిఏ వెంటనే చెల్లించాలని, మధ్యంతర భృతి 30శాతం వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగులు పెన్షనర్లు పాల్గొన్నారు.